


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

మంగళవారం

12-08-2025

పేజీలు: 02




## సృష్టి కేసులో మరో నలుగురి కోసం గాలింపు

సృష్టి సంతాన సాఫల్య కేంద్రం మోసం కేసులో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు గోపాలపురం పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతోపాటు.. మొత్తం 25 మంది అరెస్టయ్యారు. వీరిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వైద్యులు, టెక్నీషియన్లు, ఏజెంట్లు, చిన్నారుల అక్రమ రవాణా ముఠాల సభ్యులున్నారు. నమ్రత ముఠాలో కీలకంగా వ్యవహరించిన మరో నలుగురి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. వీరికోసం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడ, నెల్లూరు ప్రాంతాలకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ కేసులో.. ఈ నలుగురు కీలకమని, వారి వాంగ్మూలం కీలకమనిదర్యాప్తు అధికారులు చెబుతున్నారు. కాగా.. నమ్రత, ఆమె కుమారుడు జయంత్‌కృష్ణ, ఇతర నిందితులు బెయిల్ కోసం సికింద్రాబాద్ కోర్టులో పిటిషన్లు వేశారు. అయితే.. వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ రాకుండా దర్యాప్తు అధికారులు బలమైన కౌంటర్ దాఖలు చేశారు. నిందితులు బెయిల్‌పై బయటకు వస్తే.. సాక్ష్యాధారాలను తారుమారు చేసే ప్రమాదముందని కోర్టుకు విన్నవించారు. పోలీసుల వాదనలను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. నిందితులకు బెయిల్‌ను నిరాకరించింది.




## రావు బహదూర్‌గా సత్యదేవ్ షాకింగ్ మేకోవర్..

మన టాలీవుడ్ సినిమా దగ్గర ఉన్నటువంటి టాలెంటెడ్ అండ్ అండర్ రేటెడ్ నటుల్లో సత్యదేవ్ కూడా ఒకరు. తన బ్లఫ్ మాస్టర్ సినిమా తర్వాత చాలామంది తన నటనకి ఫిదా అయ్యారు. లీసెంట్ గా జీబ్రా సినిమాతో ఆకట్టుకున్న సత్యదేవ్ నుంచి ఇంకా ఎక్కువ ఆశిస్తున్న వారికి సమాధానం అన్నట్టుగా తన లేటెస్ట్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ కనిపిస్తుంది. "రావు బహదూర్" అంటూ ఒక షాకింగ్ మేకోవర్ ని సత్యదేవ్ చేసి చూపించాడు. కంప్లీట్ డిఫరెంట్ గా కనిపిస్తున్నాడు. ఒక ముసలి రాజుగా ఇంకా చెప్పాలంటే తాతగా, ముసలి భూతంగా తాను కనిపిస్తున్నాడు. ఇంకా తన లుక్ లో చిన్న చిన్న పిల్లలు కూడా కూడా కనిపిస్తున్నారు. అంటే ఇదేమన్నా ఫాంటసీ డ్రామానా అన్నట్టు కూడా ఉంది. కేరాఫ్ కంచరపాలెం దర్శకుడు వెంకటేష్ మహా చేస్తున్న సినిమా ఇది కాగా అనుమానం పెనుభూతం అనే లైన్ తో హైలైట్ చేస్తున్నారు. దీనితో మాత్రం సత్యదేవ్ నుంచి ఏమైతే కోరుకుంటున్నారో మళ్ళీ మహేశ్వర ఉగ్రరూపస్య సినిమాతో వెంకటేష్ ప్రెజెంట్ చేయబోతున్నాడు అనిపిస్తుంది. ఇక ఈ చిత్రాన్ని శ్రీచక్ర ఎంటర్టైన్మెంట్స్ అలాగే ఏ ప్లస్ ఎస్ సినిమాస్ వారు నిర్మాణం వహిస్తుండగా సూపర్ స్టార్ మహేష్ బాబు సమర్పణలో రాబోతుంది. మరి ఈ చిత్రం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

## స్టాలిన్‌పై మాజీసీఎం

# పళనిస్వామి ధ్వజం

తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజల్ని మభ్యపెడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ గురించి తమకు బాగా తెలుసని అన్నాడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఎద్దేవా చేశారు. డీఎంకే పాలనలో అన్ని రంగాల్లో కుంటుపడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పరచడమే తమ లక్ష్యమని ప్రకటించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం...తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో ఈపీఎస్ చేపట్టిన రెండో విడత ప్రచారంలో భాగంగా సోమవారం కృష్ణగిరి జిల్లా వేపనహల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో సాగింది. రాయకోట అన్నా విగ్రహం జంక్షన్‌లో నిర్వహించిన రోడ్ షోలో మాజీ మంత్రులు బాలచంద్రారెడ్డి, కేపీ మునుస్వామితో కలసి రోడ్ షోలో పాల్గొన్న ఈపీఎస్ మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని, మామిడి పండ్ల దిగుబడిలో కృష్ణగిరి జిల్లా దేశంలోనే అగ్రస్థానంలో ఉందని అయితే, అధిక





దిగుబడుల కారణంగా నష్టపోయిన రైతుల నుంచి మామిడి కొనుగోలు చేయకుండా ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. అలాగే, రబ్బరు రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేదని, ఈ రెండు డిమాండ్లతో ఇటీవల జిల్లాలో అన్నాడీఎంకే భారీస్థాయిలో ఆందోళన నిర్వహించినట్లు ఈపీఎస్ తెలిపారు. హోసూరులో అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.20 కోట్లతో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో నిర్మించిన వేలం కేంద్రాన్ని డీఎంకే ప్రభుత్వం మూసివేసిందని, తాము వచ్చే ఏడాది మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రం ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## బండి సంజయ్‌కి లీగల్ నోటీసులు పంపిన కేటీఆర్

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి లీగల్ నోటీసులు పంపిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ అడ్డగోలుగా అసత్యపూరితంగా చేసిన వ్యాఖ్యలపై లీగల్ నోటీసులు. ఒక కేంద్రమంత్రిగా ఉండి బాధ్యతారహితంగా మరొక ప్రజాప్రతినిధిపై అసత్యపూరిత ఆరోపణలు చేయడం దుర్మార్గం. కేవలం రాజకీయ ఉనికి కోసమే కేటీఆర్ పైన అసత్యపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని నోటీసులో పేర్కొన్న న్యాయవాదులు. కేటీఆర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని బండి సంజయ్‌కి లీగల్ నోటీసులో పేర్కొన్న న్యాయవాదులు. భవిష్యత్తులో అడ్డగోలుగా అసత్య ఆరోపణలు చేయకుండా ఉండాలని డిమాండ్. లేకుంటే తదుపరి లీగల్ నోటీసుతో పాటు, చట్టంలో అందుబాటులో ఉన్న క్రిమినల్ చర్యలకు కూడా బండి సంజయ్ బాధ్యుడు అవుతారని హెచ్చరిక.



## రెండో రౌండ్‌కు అల్కరాజ్

వింబుల్డన్‌లో అనూహ్య ఓటమి అనంతరం కొన్నిరోజుల పాటు ఆటకు విరామమిచ్చిన స్పెయిన్ నయా బుల్ కార్లోస్ అల్కరాజ్.. యూఎస్ ఓపెన్‌కు ముందు తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. అమెరికా వేదికగా జరుగుతున్న సిన్సినాటి ఓపెన్‌లో రెండో సీడ్ అల్కరాజ్.. 6-1, 2-6, 6-3తో డామిర్ జుముహుర్ (బోస్నియా) పై గెలిచి రెండో రౌండ్‌కు చేరాడు.



## వైభవ్ సూర్యవంశీకి బంఫర్ ఆఫర్

వయస్సుతో సంబంధం లేకుండా అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన యువ క్రికెటర్లను ప్రోత్సహించడంలో బీసీసీఐ ముందుంటుందనే విషయం తెలిసిందే. అయితే ఈసారి బీసీసీఐ ఒక అడుగు ముందుకేసి, భారత క్రికెట్ జట్టు భవిష్యత్తు కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. భారత క్రికెట్‌కు రెండు దశాబ్దాలకు పైగా సేవలందించిన దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ నిష్క్రమణకు సిద్ధమవుతున్న తరుణంలో, వారి స్థానాన్ని భర్తీ చేయగల సత్తా ఉన్న ఆటగాళ్లను తయారుచేయడానికి బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది.ఈ కార్యక్రమం కింద ఎంపికైన యువ ఆటగాళ్లలో ఒకరు వైభవ్ సూర్యవంశీ. 14 ఏళ్ల వైభవ్ ఇప్పటికే ఐపీఎల్‌లో తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరి దృష్టిని ఆకర్షించాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతూ, ఐపీఎల్‌లో అతి చిన్న వయసులో సెంచరీ సాధించిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అతని ఈ ప్రదర్శన బీసీసీఐని ఎంతగానో ఆకట్టుకుంది. దీని ఫలితంగా, బీసీసీఐ అతన్ని నేషనల్ క్రికెట్ అకాడమీ (NCA) లో ప్రత్యేక శిక్షణ కోసం ఎంపిక చేసింది.

## ఐదో రౌండ్‌లో అర్జున్‌కు డ్రా

చెన్నై గ్రాండ్ మాస్టర్స్‌లో జర్మనీ ఆటగాడు విన్సెంట్ కెమెర్ జోరు కొనసాగుతున్నది. సోమవారం జరిగిన ఐదో రౌండ్‌లో కెమెర్.. భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ గుజరాతీతో గేమ్‌ను డ్రా చేసుకున్నా పాయింట్ల పట్టికలో అతడు 4 పాయింట్లతో అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. తొలి మూడు రౌండ్లలో రెండు విజయాలతో మెరిసి నాలుగో రౌండ్‌లో ఓడిన టాప్ సీడ్ అర్జున్ ఇరిగేసి.. భారత్‌కే చెందిన ప్రణవ్‌తో ఆడిన ఐదో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. ఒకదశలో ప్రణవ్.. తెలంగాణ కుర్రాడికి గట్టిపోటీనిచ్చినా అతడు డ్రాతో గట్టెక్కాడు. ఈ డ్రాతో అర్జున్.. 3 పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచాడు.




## నిజ జీవిత ఘటనల ఆధారంగా 'జాలీ ఎల్ఎల్‌బీ-3'

అక్షయ్‌కుమార్, అర్షద్ వార్సీ ప్రధాన పాత్రల్లో నటించిన కోర్ట్‌రూమ్ కామెడీ డ్రామా 'జాలీ ఎల్ఎల్‌బీ' సిరీస్‌లోని రెండు చిత్రాలు ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. మూడో భాగం 'జాలీ ఎల్ఎల్‌బీ3' సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకరానుంది. ఈ నేపథ్యంలో సోమవారం మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. అక్షయ్‌కుమార్, అర్షద్ వార్సీ మధ్య ఉండే వృత్తిపరమైన పోటీని స్ఫురించేలా ఈ పోస్టర్‌ను తీర్చిదిద్దారు. మొదటి రెండు భాగాల మాదిరిగానే ఈ మూడోభాగాన్ని కూడా నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించామని, ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచుతుందని అక్షయ్ కుమార్ తన సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. సుభాష్ కపూర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.







## కియారా బికినీ సీన్స్

కొందరు సినిమా కథ కోసం చూస్తారు.. ఇంకొందరు హీరో కోసం చూస్తారు.. మరికొందరు ఎంటర్ టైన్మెంట్ కోసం చూస్తారు.. అయితే కుర్రకారు మాత్రం సినిమాలను హీరోయిన్ అందాల కోసం చూస్తారు. సినిమా అన్నాక అన్ని ఉండాలి. అందులో బాలీవుడ్ అంటే బికినీ సీన్స్ తప్పకుండా ఉండాలి. ఇక ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు టాలీవుడ్ కూడా ఎదురుచూస్తున్న సినిమా వార్ 2. హృతిక్ రోషన్,ఎన్టీఆర్ మల్టీస్టారర్ గా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 14 న రిలీజ్ కు రెడీ అవుతోంది.ఇక ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తుంది. వార్ 2 సినిమాను ఎందుకు చూడాలి అనే ప్రశ్న వస్తే.. కొందరు హృతిక్ కోసం అంటే.. కొందరు ఎన్టీఆర్ కోసం అంటారు.. కానీ, చాలామంది కియారా బికినీ సీన్స్ కోసం అని చెప్పుకొస్తున్నారు.

EVENING EDITION
మంగళవారం | 12 ఆగస్ట్ 2025
www.suryaa.com 4PM
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేను, మా అన్న ఇద్దరం సమర్థులమే.. ఇద్దరం గట్టిగా ఉన్నాం.. మంత్రి పదవులు ఇస్తే తప్పేంటని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నామని. పార్లమెంట్ ఎన్నికల సమయంలో రెండవసారి ప్రామిస్ చేసినప్పుడు తెలియదా మేమిద్దరం అన్నదమ్ములం ఉన్నామని. ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య ఒడ్డు దాటాక బోడి మల్లయ్య అన్న చందంగా ఉందని కాంగ్రెస్ నాయకత్వంపై రాజగోపాల్ రెడ్డి నిప్పులు చెరిగారు.

మునుగోడు ప్రజలకు అన్యాయం జరిగితే రాజగోపాల్ రెడ్డికి అన్యాయం జరిగినట్టే. నాకు అన్యాయం జరిగితే పర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా ఇప్పుడు కూడా చెప్తున్నా.. మీరు మాటిచ్చారు ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటివరకు మాత్రం మునుగోడు అభివృద్ధికి సహకరించి ఒక్క రూపాయి కూడా ఆపొద్దు. ఇస్తామన్నమాట ఆలస్యమైంది సమీకరణాలు కుదరటం లేదు అంటున్నారు. ఎందుకు కుదరటం లేదు సమీకరణలు? ఎవరడ్డుకుంటున్నారు నాకు మంత్రి పదవి రాకుండా అని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు.

9 మంది ఎమ్మెల్యేలు ఉన్న ఖమ్మం జిల్లాకి ముగ్గురు మంత్రులు ఉన్నారు. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్గొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండడం తప్పా. ఇద్దరం అన్నదమ్ముల్లో ఇద్దరం సమర్థులమే, ఇద్దరం గట్టి వాళ్లమే. ఇద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి. ఆలస్యమైనా సరే నేను ఓపిక పడుతున్న. ఈ ప్రాంతానికి అన్యాయం చేయొద్దు.. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి. భువనగిరి పార్లమెంటు నుండి ఎంపీగా పని చేశాను. నల్గొండ జిల్లాకు ఎమ్మెల్సీగా పని చేశాను. నల్గొండ జిల్లాలో ఉన్న నియోజకవర్గాలలో మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉంది. ప్రభుత్వ దవాఖానకు పోతే పేదోడికి న్యాయం జరగాలి, ప్రైవేటు ఆసుపత్రులు ప్రైవేటు పాఠశాలలు పేదవాడి రక్తం తాగుతున్నాయి. పేదవాళ్లకు అండగా ఉండాలని నేను కష్టపడుతున్న. ఆ భగవంతుడు ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే కానీ నా కోసం కాదు అని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.



# ప్రేమలత సంచలన కామెంట్స్
## జయ నా రోల్ మోడల్

'సినీ, రాజకీయ రంగాల్లో రికార్డులు సాధించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత తన రోల్ మోడల్' అని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం సమీపంలో తమ హక్కుల కోసం సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మద్దతు ప్రకటించిన ప్రేమలత, సోమవారం వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎంకే మేనిఫేస్టోలో ఉన్న హామీల్లో జీసీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న హామీ కూడా ఉందని, అయితే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేనందువల్లే సుమారు 2 వేల మందికి పైగా కార్మికులు ఆందోళన చేస్తున్నారని, అయినా మేయర్ ప్రియ, కార్పొరేషన్ అధికారులు, మంత్రులు వీరికి న్యాయం చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితలు వారికి వారే సాటి అని, వారిని ఎవ్వరితోను పోల్చలేమన్నారు. ఇదిలా ఉండగా, జయలలితతో ప్రేమలత ఉన్నట్లు డీఎండీకే కోశాధికారి ఎల్కే సుధీష్ విడుదల చేసిన ఫొటో రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపింది.

# మెదక్ జిల్లాలో దారుణం..

కన్న తండ్రి అయి ఉండి సభ్య సమాజం తలదించుకునే పని చేశాడు. 10 ఏళ్ల కన్న కుమార్తెపై ఆ తండ్రి ఆగమయ్య (35) పలు మార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆ బాలిక బయటకు చెప్పకో లేకపోయింది. అయితే ఆ బాలిక తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. దీంతో ఏం జరిగిందంటూ ఆ బాలికను కన్నతల్లి ఆరా తీసింది. కన్న తండ్రి తనపై జరిపిన అఘాయిత్యాన్ని కన్నతల్లికి ఆ బాలిక కన్నీటితో చెప్పింది. దాంతో ఆ కన్నతల్లి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ ఘటన మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం మండలంలో చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో భర్త ఆగమయ్యపై అల్లాదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు వివిధ సెక్షన్ల కింద అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఆగమయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో వైపు వైద్య పరీక్షల నిమిత్తం బాలికను మెదక్ జిల్లా ప్రభుత్వా ఆసుపత్రికి తరలించారు. తన భర్తను కఠినంగా శిక్షించాలని ఆమె పోలీసులను కోరింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే.. ఈ దారుణానికి ఒడిగట్టిన వారికి కఠినంగా శిక్షించాలని ఆ కన్నతల్లి పోలీసులను ప్రాధేయపడింది.

# లేడీ అఘోరీ శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరు




తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన లేడీ అఘోరీ శ్రీనివాస్‌కు కరీంనగర్ కోర్టు సోమవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. 10 వేల రూపాయల జరిమానాతో పాటు, ప్రతి గురువారం కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ నిర్ణయంతో శ్రీనివాస్ మంగళవారం జైలు నుంచి విడుదల కానున్నాడు. రీంనగర్‌లోని కొత్తపల్లికి చెందిన ఓ యువతి శ్రీనివాస్‌పై అత్యాచారయత్నం ఆరోపణలతో కేసు నమోదు చేయడం ఈ వివాదానికి కారణమైంది. ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో విస్తృత చర్చనీయాంశంగా మారింది. శ్రీనివాస్, లేడీ అఘోరీగా పిలుచుకునే వ్యక్తి, తన విశిష్ట జీవనశైలి, ఆధ్యాత్మిక ప్రవచనాలతో గతంలోనూ వార్తల్లో నిలిచాడు. అయితే, ఈ ఆరోపణలు అతని ఇమేజ్‌పై తీవ్ర ప్రభావం చూపాయి. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శ్రీనివాస్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కోర్టు నిర్ణయం ఈ వ్యవహారంలో కొత్త మలుపును తెచ్చింది. బెయిల్ షరతుల్లో భాగంగా, శ్రీనివాస్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో రెగ్యులర్‌గా హాజరు కావాల్సి ఉంటుంది, ఇది కేసు పురోగతిని పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన చర్యగా భావిస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు, ఆధారాలపై విచారణ ఇంకా కొనసాగుతోంది. శ్రీనివాస్‌కు బెయిల్ లభించడంతో అతని మద్దతుదారులు ఊరటనిచ్చే అంశంగా భావిస్తున్నారు. ఈ ఘటన సమాజంలో ఆధ్యాత్మిక వ్యక్తులపై నమ్మకం, ఆరోపణలపై చర్చలను మరింత రేకెత్తించింది. కేసు తదుపరి విచారణలో ఏ విధమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతానికి, లేడీ అఘోరీ శ్రీనివాస్ విడుదల కోసం సిద్ధమవుతున్నాడు,

# అదిరిపోయే బీఎస్ఎన్ఎల్ ప్లాన్




బీఎస్ఎన్ఎల్ కస్టమర్లను పెంచుకునే విధంగా ప్లాన్‌లను తీసుకువచ్చింది. గతంలో ప్రైవేట్ కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వీలు తన టారీఫ్‌లను పెంచాయి. కానీ బీఎస్ఎన్ఎల్ మాత్రం ఎలాంటి ధరలను పెంచలేదు. దీంతో చాలా మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ బాట పట్టారు. అప్పటి నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మంచి రోజులు వచ్చాయి. ప్రస్తుతం 4జీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. 5జీ కూడా త్వరలో రానుంది. అయితే వినియోగదారుల కోసం తక్కువ ధరల్లోనే ఎక్కువ వ్యాలిడిటీ ఉండే ప్లాన్‌లను తీసుకువస్తోంది.బడ్జెట్ ఫ్రెండ్లీ రీఛార్జ్ ప్లాన్లు అందించడంలో బీఎస్ఎన్ఎల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కేవలం రూ.1,999 రీఛార్జ్‌తో ఏడాది పాటు వ్యాలిడిటీ ఉండే ప్లాన్‌ను తీసుకువచ్చింది.ఈ ప్లాన్‌లో 365 రోజుల పాటు వ్యాలిడిటీ ఉండనుంది. అలాగేరోజువారీగా 1.64 జీబీ డేటా. మొత్తం 600 జీబీ డేటా ఉంటుంది. అలాగే ఏడాది పాటు అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు అందించనుంది. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేవలం ఒక రూపాయికే 30 రోజుల అపరిమిత కాల్స్ అందిస్తున్నట్లు తెలిపింది. ఇది కొత్తగా సిమ్ కొనుగోలు చేసేవారికి మాత్రమేనని ఈ ఆఫర్ ప్రకటిస్తున్నట్లు ఇటీవల ట్వీట్ చేసింది బీఎస్ఎన్ఎల్.




# ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాలకు మూసీ నదికి వరద పోటెత్తుతున్నది. అదేవిధంగా ఎగువన భారీ వర్షాలతో హిమాయత్‌సాగర్ భారీగా వరద వచ్చి చేరుతున్నది. సాగర్ పూర్తిగా నిండటంతో జలమండలి అధికారులు మూడు గేట్లు ఎత్తి మూసీలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మూసీ ఉధృతంగా ప్రవస్తున్నది. ఈ క్రమంలో మూసారంబాగ్, అంబర్‌పేట బ్రిడ్జిపై నుంచి వరద ప్రవహిస్తున్నది. దీంతో అప్రమత్తమైన అధికారులు బ్రిడ్జిపై నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. వంతెనకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సూచించారు.



# అందాల్ని చూపిస్తూ..

బాలీవుడ్ ఫైర్ యాక్ట్రస్ పూనమ్ పాండే గురించి తెలియనివారుండరు. నిత్యం ఏదో ఒక వివాదంలో వైరల్ అవడం ఆమె ప్రత్యేకత. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఎప్పుడు ఏదో ఒకటి పోస్ట్ చేస్తూ వివాదాలు సృష్టిస్తూ ఉంటుంది. సినిమాలకంటే వివాదాలతోనే పూనమ్ పాండే పేరు తెచ్చుకుంది. హీరోయిన్ కన్నా సోషల్ మీడియా మూలంగానే ఈ అందాల భామ చాలా ఫేమస్ అయింది. ఇదిలా ఉండగా తాజాగా పూనమ్ పాండేకు సంబంధించిన ఒక మీడియో నెట్టింట వైరల్ గా మారుతోంది. ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన ఓ వీడియో అందరిని ఆకట్టుకుంటోంది. వైరల్ అవుతున్న వీడియోలో.. పూనమ్ పాండే వడా పావ్ తినడం కోసం ముంబై వీధుల్లో తిరుగుతోంది. అంతేకాదు బాలీవుడ్ నటి అనే ఫీలింగ్ వదిలిపెట్టి తనకు ఇష్టమైన వడపావ్ కోసం ముంబై వీధుల్లో పడి తిరుగుతుందట. స్వయంగా తానే వచ్చి వడా పావ్‌ను కొనుక్కొని మరి రోడ్డు పైనే తింటుంది.



# కార్గో ఫ్లైట్ ఇంజిన్‌లో మంటలు

చెన్నైలో ఘోర విమాన ప్రమాదం తప్పింది. మలేషియా కౌలాలంపూర్ నుంచి వచ్చిన ఓ కార్గో ఫ్లైట్ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. రన్‌వేపై ఫ్లైట్ ల్యాండ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన పైలట్ అధికారులకు అలర్ట్ ఇచ్చారు. అయితే, విమానం సేఫ్‌గానే ల్యాండ్ కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పైలట్ అలర్ట్‌తో అప్రమత్తమైన అత్యవసర సిబ్బంది మంటలను అదుపుచేయడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. ఎవరికీ గాయాలు కాలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## బంజారా హిల్స్ కూల్చివేత..
## బోదాసు మాధవి గృహ నిర్బంధం

బంజారా హిల్స్ పెద్దమ్మ గుడి అక్రమ కూల్చివేతపై నిరసనగా, మహిళా సంఘాలు 'చలో పెద్దమ్మ గుడి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుంకుమార్చన చేపట్టాలని నిర్ణయించాయి. ఈ కార్యక్రమానికి వెళ్ళవద్దని, ప్రజల స్వరాన్ని అణచివేయాలనే ప్రయత్నంలో భాగంగా, నాచారం పోలీసులు బీజేపీ రాష్ట్రమహిళా మోర్చ ఈసీ మెంబర్ బోదాసు మాధవిని మంగళవారం ఉదయం గృహ నిర్బంధం చేసి, నాచారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

